సాక్షి
తిరుపతి

మంగళవారం । 2 । జనవరి । 2024



పొదిగి..ఒదిగి ఉంటాం
నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రంలో విదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి. పక్షిప్రేమికులు క్యూకడుతున్నారు. - 8లో



పల్లెల్లో అభివృద్ధి ఫలాలు
ప్రతి పల్లెలోనూ అభివృద్ధి ఫలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. - 8లో



సమర్థవంతంగా పనిచేయాలి
నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా, సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

స్విమ్స్‌లో ఉచిత టీకాలు



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల పీడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టీకాల (రోగ నిరోధక సేవలను) కేంద్రాన్ని సోమవారం డైరెక్టర్ ఆర్వీ. కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మొదటి వారం 1 నుంచి 7వ తేదీ వరకు మెగా క్యాంపెయిన్ లాగా ఈ ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. పురిటి బిడ్డ నుంచి పదేళ్ల వయసు పిల్లలకు ఉచితంగా టీకాలు వేయనున్నట్టు వెల్లడించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, శ్రీపద్మావతి మహిళా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషాకళావత్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణబిట్ల, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పునీత్ పాల్గొన్నారు.

'అమృత్ భారత్'కు స్వాగతం



రేణిగుంటలో స్వాగతం పలుకుతున్న అధికారులు

రేణిగుంట: భారతీయ రైల్వే ప్రవేశపెట్టిన సరికొత్త రైలు 'అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్' సోమవారం రేణిగుంట జంక్షన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. పశ్చిమబెంగాల్‌లోని మాల్దా- బెంగళూరు మధ్య నడిచే ఈ రైలును గత ఏడాది డిసెంబర్ 30న భారత ప్రధాని ప్రారంభించారు. మొత్తం 32 స్టాపులు ఉన్న ఈ రైలు సోమవారం రేణిగుంటకు చేరుకుంది. ఈ సూపర్ ఫాస్ట్ ట్రెన్‌లో మొత్తం 16 స్లీపర్ కోచ్‌లు, 8 జనరల్ కోచ్‌లు ఉన్నాయి. తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, రేణిగుంట అసిస్టెంట్ డివిజన్ ఇంజినీరు హరికృష్ణారెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం రైలు బెంగళూరుకు బయల్దేరి వెళ్లింది.

పింఛనోత్సాహం!

రాజకీయాల్లో ఇచ్చిన మాటకు కట్టుబడేవాళ్లు అరుదుగా ఉంటారని చెప్పొచ్చు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆ కోవకు చెందిన వారే. సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఏటా పింఛన్ల మొత్తాన్ని పెంచుతూ పోతున్నారు. వయసుడిగి రెక్కలాడని అవ్వాతాతలకు అండగా నిలుస్తున్నారు. ఒంటరి మహిళలు, వితంతువులకు ఆపన్న హస్తం అందిస్తున్నారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. కొత్త ఏడాదిలో సరికొత్తగా పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి ఆదర్శంగా నిలుస్తున్నారు. నా మనవడు, ఇంటి పెద్దకొడుకు పండగకు కానుక ఇచ్చాడంటూ లబ్ధిదారులు మురిసిపోతున్నారు.

కొత్త ఏడాదిలో సీఎం జగన్ కానుక
- ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు పింఛన్
- ఏటా కొత్త పెన్షన్లకూ ఢోకాలేదు
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- అవ్వాతాతల కళ్లల్లో ఆనందం
- సీఎం జగన్‌కు అభినందనల వెల్లువ

సాక్షి, తిరుపతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి (చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 2019 నుంచి 2024 జనవరి వరకు) 5,50,902 మందికి రూ.6,322.40 కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేసింది. 2014-15 నుంచి 2018-19 వరకు టీడీపీ హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పింఛన్ల పంపిణీకి సంబంధించి రూ.1,572 కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పింఛన్ల పంపిణీని పెంచుకుంటూ పోతున్నారు. అంతేకాకుండా కొత్తగా అర్హులెవరైనా తప్పిపోయి ఉంటే వారిని ఎలాంటి సిఫార్సులు లేకుండా పారదర్శకంగా ఎంపిక చేసి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా ప్రతినెలా ఒకటో తేదీ పొద్దుటే తలుపుతట్టి గుడ్ మార్నింగ్ చెప్పిమరీ చిక్కటి చిరునవ్వుతో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నారు. సెలవులు, పండుగ రోజులైనా పింఛన్లు ఆపకుండా అవ్వాతాతల కళ్లల్లో ఆనందం నింపుతున్నారు.

ఎంతెంత లబ్ధి అంటే
- 2014-19 మధ్య వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్ కేటగిరీలో ఒక్కో లబ్ధిదారుడు పొందిన పింఛన్ మొత్తం రూ.58,000
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కో లబ్ధిదారునికి అందిస్తున్న మొత్తం రూ.1,47,500, దివ్యాంగులకు రూ.1,82,000

పెంచి..ఆనందాన్ని పంచి!
- జులై 2019 నుంచి పెన్షన్ రూ.2,250కు పెంపు
- జనవరి 2022న రూ.2,500
- జనవరి 2023న రూ.2,750
- జనవరి 2024న రూ.3వేలకు పెంపు



ఇంటికి వెళ్లి లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

నాడు అలా..
- గత టీడీపీ హయాంలో పింఛన్లు తీసుకోవాలంటే లబ్ధిదారులు నానా అవస్థలు పడేవారు. లంచాలు, కుట్రలు, కుతంత్రాల కోటలు దాటితేనే పింఛన్ మంజూరయ్యేది. ఎవరైనా చనిపోతేగానీ కొత్తవారికి పింఛన్ వచ్చేది కాదు. వర్గం, పార్టీ, తారతమ్యాలు చూసి పింఛన్లు ఇచ్చేవారు. ఇక జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనే వృద్ధులు, వికలాంగులకు పింఛన్ వచ్చేది.

నేడు ఇలా
- కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా.. లంచాలు, వివక్ష, అశ్రిత పక్షపాతానికి తావులేకుండా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నారు. అర్హులు తప్పిపోయి ఉంటే మరో అవకాశాన్ని కల్పిస్తున్నారు. దళారీలు, పైరవీల బెడద లేకుండా పకడ్బందీగా పింఛన్లు అందజేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శిస్తున్నారు. అర్జీ పెట్టుకున్న 21 రోజుల్లో అర్హులకు పెన్షన్ కార్డు మంజూరు చేస్తున్నారు.

పెద్దకొడుకు జగన్



మాది నిరుపేద కుటుంబం. కరోనాతో భర్త చనిపోయాడు. వృద్ధాప్యంతో కూలి పనులకు వెళ్లలేని పరిస్థితి. అప్పటి టీడీపీ హయాంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. జన్మభూమి కమిటీల వారు కాళ్లరిగేలా తిప్పించుకున్నారు. వారి ఆమోదం లేనిదే పింఛన్ మంజూరు చేయమని అధికారులు తేల్చి చెప్పారు. ఈ ప్రభుత్వ వచ్చాక వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పింఛన్‌కు దరఖాస్తు చేయించి మంజూరు చేయించారు. నాకు ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ ఇంటికొచ్చి ఇస్తున్నారు. నాకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకుతో సమానం.
- ఆర్ లీలావతి, సీఎస్‌ఆర్ కాలని, తిరుపతి

జగనన్న వల్లే..



గత ప్రభుత్వం 65 సంవత్సరాలు పూర్తయితేనే పింఛన్ ఇస్తామని చెప్పారు. సరేలే అని దరఖాస్తు చేసుకోలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చాక వయస్సు 60 ఏళ్లకు తగ్గించారు. అంతేగాకుండా వలంటీరే ఇంటికొచ్చి నా పేరుతో పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. మూడేళ్లుగా పింఛన్ వస్తోంది. జనవరి నుంచి రూ.3వేలు ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అంతా ఆ మహానుభావుడు జగన్ దయ వల్లే..!
- ఎస్.గుల్జార్, బీ.ఎన్‌ఆర్‌పేట, చిత్తూరు రూరల్ మండలం

తలుపుతట్టి పింఛన్ ఇస్తున్నారు



నా భర్త మృతిచెందాడు. ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే మా ఇంటి తలుపు తట్టి మరీ వలంటీర్ పింఛన్ అందజేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలా ఒకటో తేదీన పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవు. గంటల కొద్దీ మండల కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది.
- చిన్నక్క, ప్రశాంత్ నగర్, కొత్తపేట 24వ వార్డు పుంగనూరు మున్సిపాలిటీ

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	ఖర్చు చేసిన మొత్తం రూ.కోట్లలో
2019-20	4,98,459	రూ.1296.04
2020-21	5,23,076	రూ.1424.20
2021-22	5,26,871	రూ.1500.69
2022-23	5,51,705	రూ.1938.54
2024 జనవరి	5,50,902	రూ.162.93

కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు

సంవత్సరం	కొత్త ఫించన్‌లు
2019-20	24,617
2020-21	3,795
2021-22	17,779
2022-23	24,834
2024 జనవరి	7,322

అర్హులందరికీ పింఛన్‌లు



జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ పింఛన్‌లు అందేలా చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఒకటో తేదీన పకడ్బందీగా పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. 2024 జనవరి 1 నుంచి రూ.2,750 నుంచి రూ.3 వేల వరకు పింఛన్ పెంచి మరీ ఇస్తున్నాం. అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు.
- షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు.

అర్హతే ప్రామాణికం



అర్హులైన వారికి ఈనెల నుంచి పింఛన్ రూ.3వేలు అందజేస్తాం. అర్హతే ప్రమాణికంగా పింఛన్లు అందజేస్తున్నాం. జిల్లాలో ఈ నెల ఏడో తేదీ వరకు వంద శాతం పింఛన్లు పంపిణీ చేస్తాం. సోమవారం వెంకటగిరిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలాల వారీగా అందరికీ అందజేస్తాం.
- కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

నూతన కానుక.. నింగికి వేడుక!

- నూతన సంవత్సరం రోజు పీఎస్‌ఎల్‌వీ సీ-58 విజయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం
- శాస్త్రవేత్తల హర్షాతిరేకం



మొదటి దశ

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నూతన సంవత్సరం ప్రారంభం రోజున దేశ ప్రజలకు గొప్ప విజయాన్ని అందించింది. సతీష్ ధవన్‌స్పేస్ సెంటర్ (షార్) నుంచి సోమవారం ఉదయం 9.10 గంటలకు పీఎస్‌ఎల్‌వీ సీ-58 ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగంలో బ్లాక్ హోల్‌పై అధ్యయనం చేయనుంది. ఇందులో భాగంగా 469 కిలోల బరువు కలిగిన పోలారిమెట్రిక్ ఉపగ్రహం ఎక్స్‌పోశాట్‌ను భూమికి 650 కిలోమీటర్ల ఎత్తులోని సన్ సింక్రనస్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ప్రపంచంలోనే ఈ తరహా ఉపగ్రహాల్లో ఇది రెండో ఉపగ్రహం.

శాస్త్రవేత్తలకు అభినందనల వెల్లువ

ఇస్రో శాస్త్రవేత్తలను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, శ్రీసిటి అధినేత రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. 60 సంవత్సరాల్లో 60 పీఎస్‌ఎల్‌వీ రాకెట్ ప్రయోగాలు చేసి విజయవంతం చేయడం దేశానికే గర్వకారణమన్నారు. ఈ ఏడాది ఆరంభంలోనే ప్రయోగాలను ఆరంభించి మొదటి విజయాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ప్రయోగం ఇలా..
- 44.4 మీటర్ల పొడవు కలిగిన రాకెట్ 260 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి పయనమైంది. 21.55 నిమిషాల్లో ప్రయోగాన్ని పూర్తి చేశారు.
- మొదటి దశలో 139 టన్నుల ఘన ఇంధనం కోర్ అలోన్ దశలో ఈ ప్రయోగాన్ని 110 సెకండ్లలో పూర్తిచేశారు.
- 41.9 టన్నుల ద్రవ ఇంధనాన్ని వినియోగించి 262.38 సెకండ్లలో రెండో దశను పూర్తిచేశారు.
- 7,66 టన్నుల ఘన ఇంధనం సాయంతో 586.42 సెకండ్లలో మూడో దశ పూర్తి.
- 1.6 టన్నుల ద్రవ ఇంధనంతో 1258.92 సెకండ్లలో నాలుగో దశ పూర్తిచేసి కటాఫ్ చేశారు.



రెండోదశ ప్రయాణం



మూడోదశ



నాలుగోదశ



భూమికి 650 కి.మీలో

పీఎస్‌ఎల్‌వీ సీ58 విజయవంతం



పీఎస్‌ఎల్‌వీ సీ-58 ప్రయోగ విజయం నూతన సంవత్సరానికి గిఫ్ట్. ఎక్స్‌పోశాట్‌ను కక్ష్యలోకి ప్రవేశపెట్టడమే తరువాయి. సోలార్ ప్యానెల్స్ రెండూ విజయవంతంగా విచ్చుకున్నాయి. ఉపగ్రహం ఆరోగ్యకరంగా ఉంది. విశ్వంలో ఏర్పడుతున్న బ్లాక్‌హోల్స్‌పై ఈ ఉపగ్రహం అధ్యయనం చేస్తుంది. ఇస్రో టీంకు అభినందనలు.
- ఎస్.సోమనాథ్, ఇస్రో చైర్మన్

తిరుగులేని మిషన్ పీఎస్‌ఎల్‌వీ



పీఎస్‌ఎల్‌వీ రాకెట్ సిరీస్‌ది ఒక చరిత్ర. పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌కు సంబంధించిన అన్ని ప్రయివేట్ పారిశ్రామిక సంస్థలకు, ఇస్రోలోని అన్ని సెంటర్ల డైరెక్టర్లు, టీం సభ్యులకు ధన్యవాదాలు. వెహికల్ ఫెర్‌పార్మన్స్ అద్భుతంగా పనిచేసింది.
- జయకుమార్, మిషన్ డైరెక్టర్

విజయవంతంగా పనిచేశాయి



రాకెట్‌లో ద్రవఇంధన దశలు అద్భుతంగా పనిచేశాయి. పీఎస్ ఎల్‌వీ రాకెట్ అపజయం లేని రాకెట్. రాకెట్‌లకు అవసరమైన లిక్విడ్‌స్టేజీని ఈ సెంటర్ నుంచే అందిస్తున్నాము. దీనికి సంబంధించి ఇండస్ట్రియల్ పార్టనర్స్, ఇస్రో టీంకు ప్రత్యేక కృతజ్ఞతలు.
- డాక్టర్ కే-నారాయణన్, ఎల్‌పీఎస్సీ డైరెక్టర్

పేలోడ్స్ అత్యంత శక్తివంతమైనవి



ఎక్స్‌పోశాట్ ఉపగ్రహంలో అమర్చిన పోలారిక్స్, ఎక్స్‌పెక్ట్ అనే రెండు పేలోడ్స్ అత్యంత శక్తివంతమైనవి. ఈ రెండు పెలోడ్స్‌ను రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, బెంగళూరులోని యూఆర్‌ఎస్సీ శాస్త్రవేత్తలు రూపొందించారు.
- ఎం.శంకరన్, యూఆర్‌ఎస్సీ డైరెక్టర్

ఖగోళ పరిశోధనలకే ఎక్స్‌పోశాట్



ఖగోళ పరిశోధనలకు ఎక్స్‌పోశాట్‌ను అత్యంత శక్తివంతంగా తయారు చేశాం. విశ్వంలో బ్లాక్ హోల్స్‌పై పరిశోధనలకు నాసా ఒక ఉపగ్రహాన్ని ప్రయోగించింది. ప్రపంచంలో ఇస్రో ప్రయోగించిన రెండో ఉపగ్రహమిది. ఆస్ట్రోశాట్‌కు అన్నగా ఎక్స్‌పోశాట్ పనిచేస్తుంది. ఇందులో శక్తివంతమైన రెండు పేలోడ్స్‌ను పంపాము.
- బృందాబన్ మాతో, శాటిలైట్ డైరెక్టర్

వెంకటేశ్వర స్వామి వెండి చిత్రపటంతో పరుగులు తీస్తున్న కోడెగిత్తను పట్టుకునేందుకు పోటీ పడుతున్న యువకులు



రంకేసిన పౌరుషం

- ఉరకలేసిన యువకులు
- జనసంద్రంగా మారిన కొత్తశానంబట్ల



జనసంద్రంగా మారిన కొత్తశానంబట్ల

చంద్రగిరి: సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పల్లెటూళ్ల పరుష పందేల(జల్లికట్టు)తో కాలుదువ్వుతున్నాయి. కొత్తశానంబట్లలో సోమవారం పరుష పందేలు నిర్వహించారు. ఆంగ్ల నూతన సంవత్సరం రోజున ప్రతి ఏటా పరుష పందేలు నిర్వహించడం ఆనవాయితీ. వేడుకలను తిలకించడానికి జిల్లాతో పాటు కర్ణాటక నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇందులో భాగంగా ముందుగా పశువులకు నల్లని దారాన్ని కట్టి, బుడగలు, పుష్పాలతో అలంకరించారు. కొమ్ములకు పలకలు కట్టి బరిలోకి దింపారు. ఆవులు, ఎద్దులు, కోడెగిత్తలను గుంపులు గుంపులుగా పరుగులెత్తించారు. వాటిని నిలువరించి పలకలను సొంతం చేసుకునేందుకు యువకులు పోటీపడ్డారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కోడెగిత్తల కట్టడిపై పందేలు

పశువుల యజమానులు తమ కోడెగిత్తలను అదుపు చేయడంపై పెద్ద ఎత్తున పందేలు కాశారు. తన ఎద్దును అదుపు చేసిన వారికి ఎకరా పొలం రాసిస్తానంటూ ఓ వ్యక్తి చేసిన పందేం హాట్ టాపిక్‌గా మారింది. మరి కొందరు పట్టువస్త్రాలు, నగదును పందెంగా పెట్టారు. రామచంద్రాపురం మండలం మచ్చారెడ్డిపల్లికి చెందిన ఒక వ్యక్తి తన ఎద్దుకు సుమారు 350 గ్రాముల వెంకటేశ్వర స్వామి వెండి ప్రతిమను అమర్చి పోటీలోకి దింపాడు. దీంతో ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు.

పలువురికి గాయాలు

కోడెగిత్తలను అదుపు చేసే సమయంలో పలువురు యువకులు గాయపడ్డారు. సుదూర ప్రాంతాలను నుంచి పరుష పందేలను చూడడానికి ఇచ్చిన జనాలపైకి కోడెగిత్తలు దూసుకెళ్లడంతో గాయాలయ్యాయి. వెంకటంపేటకు చెందిన చింటూ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మరో వ్యక్తికి ఎద్దును అదుపు చేసే క్రమంలో కాలు విరిగింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు గ్రామస్తులు సాదరంగా స్వాగతం పలికి అన్నదానం చేశారు.

నవశకానికి నాంది పలుకుదాం

- తలకోన సిద్ధేశ్వర స్వామి సేవలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి
- విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి
- భాకరాపేట, ఎర్రావారిపాళెంలో పార్టీ నేతల ఘన స్వాగతం

భాకరాపేట: ప్రముఖ శైవక్షేత్రమైన తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి వారిని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం వేకువ జామున స్వామి వారి సేవలో పాల్గొన్నారు. వీరికి భాకరాపేట, ఎర్రావారిపాళెం కూడలిలో స్థానిక నేతలు ఘన స్వాగతం పలికారు. గజ మాలలతో సత్కరించారు. తలకోన ఆలయం వద్దకు చేరుకోగానే ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ముఖమండపంలో వేద ఆశీర్వచనం అందించగా.. అధికారులు తీర్థ ప్రసాదాలను అందించారు. భక్తులను ఆప్యాయంగా పలకరిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో వేద ఆశీర్వాదం తీసుకుంటున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, తుడా చైర్మన్

క్లుప్తంగా

తిరుమల ఘాట్ రోడ్‌లో ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లో కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు .. తమిళనాడు కాంచీపురానికి చెందిన ఆనంద్ మురుగన్, మురుగన్ సుబ్బరాజు, మరో ముగ్గురు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనానంతరం తిరుమల నుంచి తిరుపతికి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి ఘాట్ రోడ్డు మీదుగా దిగుతుండగా 30వ మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపై నుంచి కారు అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో స్వల్ప గాయాలతో భక్తులు బయటపడగా వారిని వెంటనే ఘాట్‌రోడ్డు సిబ్బంది రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

పిచ్చికుక్క వీరంగం

పాకాల: పిచ్చికుక్క వీరంగం సృష్టించి ఐదుగురిని గాయపరిచిన ఘటన మండలంలోని కృష్ణాపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. సోమవారం ఉదయం పిచ్చికుక్క గ్రామంలో తచ్చాడుతూ కనిపించింది. దారి వెంట కనిపించిన వారిని వెంటబడి మరీ కరిచి గాయపరిచింది. గాయపడిన వారిలో గ్రామానికి చెందిన ఎంఎం.నాయుడు, వీ.చంద్రమ్మ, ఆర్.భాగ్యమ్మ, ఐ.జయమ్మ, పీ.జ్వాలాముఖి ఉన్నారు. వీరికి దామలచెరువు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు.

పల్లెల్లో అభివృద్ధి ఫలాలు


సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, వేదికపై ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జేసీ శ్రీనివాసులు

ప్రతి పల్లెనూ అభివృద్ధి చేశాం .. ఎక్కడికక్కడ రోడ్లు వేయించాం.. మురుగునీటి కాలువలు నిర్మించాం.. దాహార్తిని తీర్చేందుకు పకడ్బందీగా తాగునీరు అందిస్తున్నాం.. నిరుపేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేయించాం.. వేలాది గృహాలను వేగంగా పూర్తి చేయిస్తున్నాం.. వ్యవసాయానికి భరోసా కల్పించేందుకు సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం.. చంద్రబాబు అడ్డుపడి రైతులకు అన్యాయం చేశారు.. తన నైజానికి తగ్గట్టుగా మళ్లీ మోసాలకు తెరతీశారు.. స్వార్థ ప్రయోజనాల కోసం జనం గొంతు కోస్తున్నారు'' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం రొంపిచెర్లలో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేశారు.

- ప్రతి గ్రామానికీ పక్కాగా రోడ్లు
- పైప్‌లైన్ ద్వారా గండికోట జలాలు
- సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకుంది చంద్రబాబే
- ప్రజలను మోసం చేయడమే ఆయన నైజం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి

రొంపిచెర్ల : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్మిస్తున్న సాగు నీటి ప్రాజెక్టులను కోర్టుల్లో కేసులు వేయించి అడ్డుకుంది చంద్రబాబే అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఆవులపల్లె వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టు పూర్తయితే సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పీలేరు మండలాలకు సాగు, తాగునీటి కష్టాలు ఉండవన్నారు. చంద్రబాబు వేయించిన కేసుపై ఈ నెలలో వాదనలు జరిగే అవకాశముందని, అనుకూలంగా తీర్పువస్తే రాబోయే ఎన్నికల నాటికే ప్రాజెక్టు పనులు పూర్తి చేసేస్తామని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పథకాలను మంజూరు చేశామని తెలిపారు. ఓటేయని గ్రామాల్లో సైతం ట్యాంక్‌లను నిర్మించి గండి కోట నుంచి తాగునీటిని పైపులైన్ ద్వారా అందించే పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో తారురోడ్లు, సీసీ రోడ్లు, మురుగు నీటి కాలవలు నిర్మించామన్నారు. 15 వేల ఇళ్లను మంజూరు చేయించామని, అందులో 14 వేల గృహాల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో రైతులు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని విమర్శించారు. టీడీపీకి ఓటేస్తే ప్రజలకు క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న సచివాలయాలు, వలంటీర్లను తొలగిస్తారని హెచ్చరించారు. ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్, చంద్రబాబు పాలనలను బేరీజు వేసుకోవాలని సూచించారు. కుప్పంలో కూడా ఈ పర్యాయం చంద్రబాబును ఇంటికి పంపేయడం ఖాయమని వెల్లడించారు. ఎల్లో మీడియా అండగా క్షుద్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అనంతరం 369 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీపీఓ లక్ష్మి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, నాయకులు చెంచురెడ్డి, నూలు రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత


మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు ఆది నారాయణరెడ్డి

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులుపేటకు చెందిన టీడీపీ నేత ఆదినారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడైన ఆదినారాయణరెడ్డికి ప్రభుత్వం ఇంటి పట్టా మంజూరు చేసింది. పార్టీలకు అతీతంగా సేవలందిస్తున్న జగనన్నకు అండగా నిలవాల్సిన బాధ్యత తనపై ఉండడంతోనే వైఎస్సార్‌సీపీలో చేరినట్లు ఆదినారాయణరెడ్డి వెల్లడించారు. మంత్రి పెద్దిరెడ్డి చేసిన అభివృద్ధి పనులకు ఆకర్షితులైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, కోటా వెంకటరమణ పాల్గొన్నారు.

సేవ సామాజిక 'కర్తవ్యం'!

- నూతన సంవత్సరం రోజున అభాగ్యుల సేవలో ఎస్పీ దంపతులు
- దుప్పట్లు, పండ్లు, నిత్యావసర సరకులు పంపిణీ
- సేవా కార్యక్రమాలను 'సాక్షి'తో పంచుకున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

సాక్షి, తిరుపతి డెస్క్: పోలీసులు విధి నిర్వహణలో కర్కశత్వాన్నే కాదు.. సేవా గుణాన్నీ కలిగి ఉంటారని నిరూపించారు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి. సోమవారం నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని అభాగ్యుల సేవలో సతీసమేతంగా పాల్గొని తరించారు. స్థానిక ఖాదీ కాలనీలోని జగన్మాత చర్చిలో ప్రత్యేక ఆరాధన అనంతరం ఎస్పీ దంపతులు ఇక్కడి మదర్ థెరిసా ఆశ్రమాన్ని సందర్శించారు. వృద్ధులు, అభాగ్యులు, మానసిక వికలాంగులతో కేక్ కట్ చేయించి తినిపించారు. దుప్పట్లు, పండ్లు, డ్రైఫ్రూట్స్, నిత్యావసరకులు పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని, అభాగ్యుల నడుమ ఇలా సేవా కార్యక్రమాలతో గడపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చర్చి ఫాదర్ రెవరెండ్ సగిలి ప్రకాష్ ఎస్పీ దంపతులను శాలువాతో సత్కరించి, వారికి ఆంగ్ల బైబిల్ బహూకరించి ఆశీర్వదించారు. తనను కలిసిన 'సాక్షి'తో ఎస్పీ కొన్ని క్షణాలు ముచ్చటించారు. 'ఆంగ్ల సంవత్సరం ప్రారంభం రోజున సామాజిక సేవతో శ్రీకారం చుట్టడంలో ఏమైనా ప్రత్యేకత ఉందా?' అని ఆయనను ప్రశ్నించగా.. సేవ చేయడమనేది స్వచ్ఛందం అన్నారు. సంవత్సరం ప్రారంభం రోజున ఇలా చేసి అంతటితో వదలి వేయమన్నారు. సేవ నిరంతర ప్రక్రియ అని చెప్పారు. ఎంత బిజీగా ఉన్నా ఇదొక సామాజిక కర్తవ్యం అని చెప్పారు. తన వంతుగా అభాగ్యులకు చేయూతనందిస్తూ ఉంటానని వెల్లడించారు. ఇందులోనే ఆత్మసంతృప్తి, అలౌకిక ఆనందమూ ఉందని ఆయన వివరించారు. ఫాదర్ సురేష్, ఆశ్రమ సిస్టర్లు ప్రసన్న, జోసఫిన్, బజిలీన్, ఆగ్నెస్, ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, వెంకట్రావ్, డీఎస్పీలు సురేందర్‌రెడ్డి, భవ్య కిశోర్, పలువురు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సరికొత్త ఆశలతో..!


తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

- తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ప్రత్యేకంగా ఆకర్షిస్తున్న పుష్పాలంకరణ
- ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు విచ్చేసి కొత్త సంవత్సరం కలిసి రావాలని.. కోటి ఆశలతో కోనేటి రాయుడిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వవిప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక ఫల, పుష్పాలంకరణ చేపట్టారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. స్వామి వారి గర్భాలయంతో పాటు పరిసరాలు అన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. గ్రామశివార్ల నుంచి రంగు రంగు విద్యుత్ దీపాలు, రకరకాల పుష్పాలంకరణతో వీధులన్నీ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల రద్దీకి తగినట్లు ఆలయం వద్ద పటిష్ట క్యూలైన్లు ఏర్పాటు చేశారు. గ్రామ శివార్లలోనే వాహనాల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ఆలయం వద్దకు వచ్చే భక్తులకు క్రమపద్ధతిలో స్వామి దర్శనం కల్పించేలా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.


భక్తులకు ప్రసాదాలను అందిస్తున్న ఆలయ సిబ్బంది

నిరంతర ప్రసాదాల పంపిణీ

నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఉదయం నుంచి భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. స్వామివారిని దర్శనం చేసుకుని వచ్చే భక్తులకు పులిహోర, పెరుగన్నం, చక్కెర పొంగలి వంటి అన్న ప్రసాదాలు పంపి ణీ చేశారు. స్వామివారి సుప్రభాత సేవలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోసింహ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.


ఆలయ ధ్వజస్తంభం వద్ద తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ హాజరయ్యారు.

సమర్థవంతంగా పనిచేయాలి


కేక్ కట్ చేసి డీఆర్వో పెంచల కిషోర్‌కు తినిపిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: కొత్త సంవత్సరంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ బంగ్లాలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు అధికారులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కలెక్టరేట్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జేసీ శుభం భన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, తిరుపతి నగరపాలక కమిషనర్ హరిత, రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు నిషాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, చంద్రముని, సీపీఓ ప్రేమచంద్రారెడ్డి, డీఈఓ వీ.శేఖర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌లు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసరావు, రేణిగుంట తహసీల్దార్ ఉదయసంతోష్, తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, డీఎల్‌డీఓ సుశీలాదేవి, డీఏఓ ప్రసాద్‌రావు, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి విజయకుమార్, పరిశ్రమల విభాగం జీఎం ప్రతాప్‌రెడ్డి, డీఎస్ఓ రాజారఘువీర్, సర్వే విభాగం జిల్లా అధికారి జయరాజ్, పౌరసంబంధాల జిల్లా అధికారులు బాలకొండయ్య, విజయసింహారెడ్డి, హౌసింగ్ జిల్లా అధికారి వెంకటేశ్వరావు, ఎస్పీడీసీఎల్ ఈఈ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి రవికుమార్, వీఆర్వోల సంఘం తిరుపతి డివిజన్ అధ్యక్షుడు చెంగ్రాయల్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో అయ్యప్ప భక్తుడి మృతి


నాదమునిరెడ్డి (ఫైల్)

ఏర్పేడు: అయ్యప్ప భక్తుడు మృతిచెందిన ఘటన మండలంలోని ఇసుకతాగేలి గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది. వివరాలు ఇసుకతాగేలి గ్రామానికి చెందిన తిరుమణ్యం నాదమునిరెడ్డి(53) పది రోజుల క్రితం అయ్యప్పమాల ధరించి ఆదివారం అయ్యప్పస్వామి దర్శనానికి రైలులో శబరిమలకు బయలుదేరి వెళ్లాడు. సోమవారం సాయంత్రానికి పంబానది వద్దకు చేరుకున్న అతను నదిలో స్నానం చేసేందుకు దిగుతుండగా గుండెపోటుతో అక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న మహిళల అరెస్ట్

కుప్పం : విశాఖపట్నం నుంచి తమిళనాడులోని కృష్ణగిరికి 12 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహిళలను కుప్పం రైల్వేస్టేషన్‌లో ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు విశాఖపట్నం సమీపంలోని రోలుకుంట మండలం బెన్న భూపాలపతనం ఎస్సీ కాలనీకి చెందినా లోవలక్ష్మి, కృష్ణగిరికి చెందిన మల్లికగా గుర్తించారు. ఈ మేరకు కేస నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

పొదిగి..ఒదిగి ఉంటాం!

- నేలపట్టు పక్షుల కేంద్రంలో విహంగాల సందడి
- తండోపతండాలుగా తరలివస్తున్న పర్యాటకులు


పిల్లలను పొదిగి ఉన్న గూడబాతులు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో విదేశీ విహంగాలు గుడ్లు పొదిగి పిల్లలతో కేరింతలు కొడుతున్నాయి. గూడబాతులు చెరువులో ఈతాడుతూ సందడి చేస్తున్నాయి. గూడబాతులు, తెడ్డు ముక్కుకొంగలు, తెల్లకంకణాయిలు, నత్తగుల్లకొంగలు, స్వాతికొంగలు, నీటికాకులు తదితర పక్షులు చెరువుల్లోని కడప చెట్లుపై పిల్లలను పొదిగి కిలకిలారావాలతో పక్షిప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా నత్తగుల్లకొంగలు, గూడబాతులు పిల్లలకు మేత పెట్టే సన్నివేశాలు చూపుతిప్పుకోనీయకుండా చేస్తున్నాయి.

కిక్కిరిసిన పక్షుల కేంద్రం

విహంగాలను వీక్షించేందుకు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. సోమవారం తిరుపతి, పీలేరు, శ్రీకాళహస్తి, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పక్షిప్రేమికులు తరలివచ్చినట్టు అధికారులు తెలిపారు. చెరువు కట్టపై ఉన్న వ్యూ పాయింట్ల వద్ద సందర్శకులు బైనాక్యులర్స్ ద్వారా పక్షులను వీక్షించేందుకు పోటీపడ్డారు. విహంగాల ప్రాముఖ్యత, వాటి ప్రత్యేకతల గురించి ఫారెస్ట్ సిబ్బంది, నేచర్ గైడ్ సందర్శకులకు వివరించారు. కొందరు సందర్శకులు పక్షుల కేంద్రంలోనే కేక్ కట్ చేసి నూతన సంవత్సర సంబరాలు చేసుకున్నారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు స్థానిక ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ బాలయ్య తెలిపారు.


పక్షులను వీక్షించేందుకు విచ్చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

తూము కాలువలోపడి వ్యక్తి మృతి


మణి (ఫైల్)

పిచ్చాటూరు: మతిస్థిమితం లేని వ్యక్తి పిచ్చాటూరు అరణియార్ ఎడమ తూము కాలువలోకి దిగి ఊపిరాడక మృతి చెందిన ఘటన సోమవారం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. వివరాలు.. నాగలాపురం మండలం, రాజులకండ్రిగ గ్రామానికి చెందిన పీ.మణి(53) మతిస్థిమితం లేక నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. సోమవారం ఉదయం రెప్పాలపట్టు గ్రామస్తులు గ్రామం పక్కన ఉన్న అరణియార్ ఎడమ తూము కాలువలో శవం తేలుతున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. శవాన్ని వెలికితీసి పరిశీలించిన పోలీసులు అతని దుస్తుల్లో ఉన్న ఆధార్ కార్డు ద్వారా వివరాలు సేకరించి బంధువులకు సమాచారం అందించారు. మణికి మతిస్థిమితంతో పాటు ఫిట్స్ వచ్చేవని, నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడని బంధువులు తెలిపారు. శవాన్ని స్వాధీనం చేసుకొని స్వగ్రామమైన రాజులండ్రిగకు తీసుకెళ్లి బంధువులు ఖననం చేశారు.